

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు 'మిట్స్' విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి-మదనపల్లి



లోహితారెడ్డి

అంగళ్ళులోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో బిటెక్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్) మూడవ సంవత్సరం చదువుతున్న లోహితారెడ్డి, విజయవాడలో జరుగు స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. ఈ ఎంపిక ప్రక్రియ కఠినమైనదని, క్యాడెట్‌లు వారి శారీరక దృఢత్వం, డ్రిల్ నైపుణ్యం, నాయకత్వ లక్షణాలు, ఎన్‌సిసి కార్యకలాపాలలో మొత్తం పనితీరుతో సహా వివిధ అంశాలపై మూల్యాంకనం చేసి ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. లోహితారెడ్డిని కరెస్పాండంట్ డాక్టర్ ఎన్.విజయ భాస్కర్‌చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల, ఎన్‌సిసి లెఫ్టినెంట్ డాక్టర్ నవీన్‌కుమార్ అభినందనలు తెలిపారు.

నేడు గండికోటకు కృష్ణా జలాలు

- 11,500 క్యూసెక్కులు విడుదల
- పూర్తిస్థాయి నీటి నిల్వపై దృష్టి
- స్థానిక ఎమ్మెల్యేలు హాజరు



అవుకు రిజర్వాయర్ వద్ద కృష్ణా జలాలకు జల హారతి ఇస్తున్న మంత్రి, జెసి, ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఎట్టకేలకు గండికోట రిజర్వాయర్‌కు కృష్ణాజలాలు రానున్నాయి. ఈమేరకు నీటిపారుదలశాఖ ఇంజినీరింగ్ యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన అవుకు రిజర్వాయర్ నుంచి శనివారం జిల్లాకు చెందిన స్థానిక ఎమ్మెల్యేల సమక్షంలో 11500 క్యూసెక్కులను విడుదల చేశారు. ఆదివారం సాయంత్రానికి గండికోట రిజర్వాయర్‌లోనికి కృష్ణాజలాలు చేరనున్నాయి. రాష్ట్రంలోని ప్రధాన రిజర్వాయర్లు శ్రీశైలం, నాగార్జునసాగర్ పూర్తి స్థాయిలో జలకళను సంతరించుకున్న సంగతి తెలిసిందే. ఈనేపథ్యంలో గండికోట రిజర్వాయర్‌కు నీటిని విడుదలకు గ్రీన్‌సిగ్నల్ లభించింది. ఇందులో భాగంగా అవుకు రిజర్వాయరుకు చెందిన కుడి నుంచి 5 వేలు, ఎడమ టన్నెళ్ల నుంచి 6,500 వేల క్యూసెక్కుల చొప్పున 11,500 వేల క్యూసెక్కులను విడుదల చేశారు. జిల్లాకు చెందిన చీఫ్ ఇంజినీర్, సహా పలువురు ఇంజినీరింగ్ యంత్రాంగం గండికోట కాల్వల పరిస్థితులను పరిశీలించిన సంగతి తెలిసిందే. కొన్ని రోజులుగా వస్తున్న నాలుగు టిఎంసిల కృష్ణాజలాల నిల్వతో అవుకు రిజర్వాయర్ పూర్తిస్థాయిలో జలకళను సంతరించుకుంది. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో అవుకు రిజర్వాయర్ నుంచి సుమారు నెల రోజులపాటు నిరంతరంగా నీటిని విడుదల చేయనున్నారు. దీంతో గండికోట రిజర్వాయర్‌ను పూర్తి స్థాయిలో నిల్వ చేయడంపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది. గండికోటను పూరి స్థాయిలో నీటిని నిల్వ చేయడం ద్వారా తాళ్ల ప్రొద్దుటూరు ముంపు గ్రామాలు, కాలనీలను బ్యాక్‌వాటర్ ముంచెత్తే అవకాశం ఉందనే ఆందోళన నెలకొంది.

త్వరలో బ్రహ్మసాగర్‌కు కృష్ణాజలాలు!

తెలుగుగంగలో అంతర్భాగమైన ఎస్ఆర్-1,ఎస్ఆర్-2 సబ్సిడీ రిజర్వాయర్లకు జిల్లానీటిపారుదలశాఖ నీటిని విడుదల చేసింది. ఈమేరకు శనివారం మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్, కలెక్టం లోతేటి శివశంకర్, చీఫ్ఇంజినీర్ మల్లికార్జునరెడ్డి, సూపరిం టెండెంట్ ఇంజినీరింగ్ వెంకటరామయ్య జలహారతి కార్యక్రమాన్ని నిర్వహించారు. వెలిగోడు రిజర్వాయర్ నుంచి విడుదల చేసిన ఐదు వేల క్యూసెక్కుల్లో లీకేజీ పోగా 2,500 క్యూసెక్కులు ఎస్ఆర్-1 రిజ ర్వాయర్‌కు చేరుతోంది. తాజాగా ఎస్ఆర్-1 రిజర్వాయర్ నిండిన నేపథ్యంలో ఎస్ఆర్-2లోకి కృష్ణాజలాలు చేరుతున్నాయి. సబ్సిడీ రిజర్వాయర్లు పూర్తిస్థాయిలో నిండిన అనంతరం 61 రోజుల వ్యవ ధిలో బ్రహ్మంసాగర్ రిజర్వాయర్‌ను పూర్తి స్థాయిలో నీటిని నిల్వ చేయడంపై ఇంజినీరింగ్ యంత్రాంగం దృష్టి సారించినట్లు తెలుస్తోంది.

అవుకు రిజర్వాయర్ నుంచి నీటి విడుదల

అవుకు రిజర్వాయర్ నుంచి కృష్ణమ్మ జలాలను గండికోట ప్రాజెక్టుకు రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి బి.సి. జనార్దన్‌రెడ్డి, జమ్మల మడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డితో పాటు కడప జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ కలిసి శనివారం జలసిరికి హారతి ఇచ్చి నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అవుకు రిజర్వాయర్ నుండి జి.ఎన్. ఎస్.ఎస్ కాలువ ద్వారా గండికోట ప్రాజెక్ట్ కు నీటిని విడుదల చేయడం వలన గండికోట ప్రాజెక్టు, మైలవరం ప్రాజెక్టు కు నీరు అంది దిగువ ప్రాంతాలకు నీటి ఎద్దడి లేకుండా చూడవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో జమ్మలమడుగు నియోజకవర్గం టిడిపి ఇంచార్జ్ చదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామిరెడ్డి, పులివెందుల టిడిపి ఇంఛార్జి బిటెక్ రవి, ఆయా ప్రాజెక్టు అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హక్కులు, బాధ్యతలు యుటిఎఫ్‌కు రెండు కళ్లు

ఆవిర్భావ దినోత్సవంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జాబిర్

ప్రజాశక్తి - రాయచోటి టౌన్



రాయచోటి టౌన్ : జెండా ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

ఒకవైపు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తూనే, మరోవైపు పాఠశాలల పరిరక్షణకు, విద్యా ప్రమాణాల మెరుగుదలకు, సమాజంతో కలిసి కృషి చేస్తున్న ఉద్యమ సంఘం యుటిఎఫ్ అని అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ జాబిర్ పేర్కొన్నారు. శనివారం యుటిఎఫ్ 51వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రమైన రాయచోటిలోని అలీమాబాద్ ఉర్దూ ఉన్నత పాఠశాల ఆవరణలో యుటిఎఫ్ జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 50 సంవత్సరాలలో యుటిఎఫ్ సాధించిన విజయాల గురించి వివరించారు. 1975లో వచ్చిన మూడవ పిఆర్‌సిలో ఎన్జీవోలతో సమానంగా ఉపాధ్యాయుల వేతనాలు సాధించడం మొదటి విజయం అని చెప్పారు.1979లో ఎన్జీవోల కంటే అదనంగా వేతనాలు సాధించారన్నారు. 1886లో రీగ్రూపింగ్ స్కేల్స్ ద్వారా పదోన్నతి రాకపోయినా సర్వీసును బట్టి ఉద్యోగోన్నతి పే స్కేలు వచ్చేలా కృషి చేసింది యుటిఎఫ్ అని భాషా పండితులకు గ్రేడ్ వన్ స్కేల్, మున్సిపల్, ట్రైబల్ వెల్ఫేర్ ఉపాధ్యాయులకు సర్వీస్ రూల్స్, ఎయిడెడ్ ఉపాధ్యాయులకు నేరుగా జీతాలు, 1998లో ఉపాధ్యాయుల బదిలీలకౌన్సెలింగ్ విధానం, అప్రెంటిస్ విధానం రద్దు చేయించడం. రెండు నోషనల్ ఇంక్రిమెంట్ల సాధన, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయులకు రెండు గోషల్ ఇంక్రిమెంట్లు సాధించడం యుటిఎఫ్ ఘనత అన్నారు. విద్యార్థుల కోసం పదవ తరగతి టెస్ట్ పేపర్లు అనుభవజ్ఞులచే తయారు చేయించి అందుబాటు ధరలో అందించడమే కాకుండా అనేక సామాజిక ఉద్యమాలలో భాగస్వామి గా ఉందన్నారు. మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా జనవిజ్ఞాన వేదిక లాంటి సంస్థల ఏర్పాటులో తన సహకారాన్ని అందించిందన్నారు. రాష్ట్రంలోని 26 జిల్లాల యుటిఎఫ్ కార్యాలయాలను కోవిడ్ ఐసోలేషన్ సెంటర్లుగా మార్చి, కార్యకర్తలే వాలంటీర్లుగా పనిచేశారని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ సురేంద్రారెడ్డి, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు ప్రసాద్ రాయచోటి మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు హఫీజుల్లా,రాజా రమేష్, చిన్నమండెం మండల సహ అధ్యక్షుడు కిపాయితుల్లా, జిల్లా కౌన్సిలర్ రెడ్డి ముని సుధాకర్, గుర్రంకొండ మండల యుటిఎఫ్ నాయకులు నరసింహారెడ్డి, రాజేంద్ర, ఉమా శంకర్ పాల్గొన్నారు. **పెనగలూరు :** ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) 50 సంవత్సరాలు పూర్తి చేసుకుని 51 వ సంవత్సరంలోకి అడుగుపెట్టిన సందర్భంగా పెనగలూరు మండల కేంద్రంలో యుటిఎఫ్ జెండా దిమ్మె ఏర్పాటు చేసి స్వర్ణోత్సవ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. యుటిఎఫ్ పెనగలూరు మండల అధ్యక్షులు యస్.వినోద్ కుమార్ జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు బి.హరి ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకు, ఉపాధ్యాయుల హక్కుల కోసం యుటిఎఫ్ నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయ ఉద్యమంలో అగ్రగామిగా నిలిచి సమస్యల పట్ల రాజీలేని పోరాటాలు చేయడం జరుగుతోందని అన్నారు. కార్యక్రమంలో గంగాధర్ బాబు, బి.రమణయ్య, సుబ్బరాయుడు, మహేశ్వర నాయుడు, కె.వి.రమణయ్య, ఖాదర్ బాషా, కె.వెంకట రమణయ్య పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్** : స్థానిక ఎంఆర్‌సి కార్యాలయంలో శనివారం ఘనంగా యుటిఎఫ్ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. నాయకులు యుటిఎఫ్ ఆవిర్భావ ఆవశ్యకత, గత ప్రభుత్వంలో యుటిఎఫ్ చేపట్టిన ఉద్యమాలు, ప్రస్తుతం చేపట్టాల్సిన కార్యాచరణ గురించి వివరించారు. ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలు గురించి వక్తలు ప్రసంగించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ సభ్యులు గురు నారాయణాచార్యులు, గాలిరవీంద్ర, ఆదినారాయణ, జిల్లా కార్యదర్శి భాస్కరరెడ్డి, పురం రమణ డివిజన్ కన్వీనర్ ఇ.సుధాకర్ సీనియర్ నాయకులు రవిప్రకాష్, జిల్లా ఉపాధ్యక్షులు హేమలత పాల్గొన్నారు.



పెనగలూరు : జెండా వద్ద నినాదాలు చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

అంబరాన్నంటేలా స్వాతంత్ర్య దినోత్సవ సంబరాలు

- ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పిలుపు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

సమాజానికి మదనపల్లె నియోజకవర్గం నుంచి మంచి సందేశం ఇచ్చేవిధంగా మదనపల్లెలో ఘనంగా ముందస్తు స్వాతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించడం జరుగుతోందని ఎమ్మెల్యే షాజహాన్ బాషా పేర్కొన్నారు. శనివారం స్థానిక జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలో విద్యాసంస్థల అధినేత రాటకొండ గురుప్రసాద్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అధ్యక్షతన 77వ స్వాతంత్ర దినోత్సవ ముందస్తు సంబరాల గురించి ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలు, జూనియర్ డిగ్రీ కళాశాలలు, ఇంజినీరింగ్ కళాశాల ప్రతినిధులతోనూ, ప్రజాసంఘాలతోనూ, ప్రభుత్వ అధికారులతోనూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈనెల 12 నుంచి 14వ తేదీ వరకు జరిగే ఈ వేడుకల్లో ప్రయివేటు, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, ఇంజినీరింగ్ కళాశాలలు క్రియాశీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ఏ విషయంలోను రాజీపడకుండా, ఎక్కడా సమస్య రాకుండా అందరూ సమన్వయం చేసుకొంటూ జయప్రదం చేయాలని కోరారు. మూడు రోజులపాటు జరిగే వేడుకల్లో ప్రతి పౌరుడు భాగస్వామం కావాలన్నారు. ఇందుకోసం వివిధ రకాల కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ వేడుకలకు జిల్లా కలెక్టర్, ఎస్‌పి, మదనపల్లె పొరుగు నియోజకవర్గాల శాసనసభ్యులను, ప్రత్యేక అతిథిగా టిటిడి ఆస్థాన గాయని శోభరాజ్‌ని ఆహ్వానించడం జరిగిందని పేర్కొన్నారు. కాగా స్వాతంత్ర దినోత్సవ ముందస్తు సంబరాల్లో 12వ తేదీన కళాశాలల విద్యార్థులచే భారీ ప్రదర్శన,13న ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల విద్యార్థులచే భారత స్వాతంత్ర పోరాటంలో అసువులు బాసిన అమరవీరుల చిత్రపటాలతో నినాదాలతో జాతీయ పతాకాన్ని చేతబట్టి, ప్రత్యేక డ్రెస్ కోడుతో భారీ ప్రదర్శన చేయడం జరుగుతుందన్నారు.14న ఉదయం పొదుపు సంఘాల మహిళలతో కళాకారులు, వాయిద్య బృందాలతో, ఎన్‌జిఒ సంఘాల ప్రతినిధులతో ప్రదర్శన కొనసాగుతుందని చెప్పారు. ఇందుకోసం 5వేల మంది కూర్చుని వీక్షించడానికి వీలుగా కుర్చీలు, తాగునీరు, లైటింగ్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 14న రాత్రి 12.43 నిమిషాలకు స్వరాజ్యం ప్రకటించగా 12.45 గంటలకు జాతీయగీతంతో వేడుకలు ముగుస్తాయని పేర్కొన్నారు. రాటకొండ గురుప్రసాద్ మాట్లాడుతూ సాంస్కృతిక విద్యా వైద్య రంగాలలో మదనపల్లికి ఎంతో పేరుప్రఖ్యాతులు ఉన్నాయని ముందస్తు స్వాతంత్ర దినోత్సవ సంబరాల సందేశాన్ని దేశానికి పంపడం కోసం మూడు రోజులుపాటు అన్ని సంస్థలు సంఘాలు కలసి వేడుకలు నిర్వహించు కోవడం జరుగుతోందన్నారు.డిఎస్‌పి కొండయ్య నాయుడు మాట్లాడుతూ స్వాతంత్ర దినోత్సవ ముందస్తు సంబరాల వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా గ్రీన్ ఛానల్ ద్వారా ట్రాఫిక్‌ను ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా పంపిస్తామని ప్రకటించారు. అనంతరం విజయభారతి కరస్పాండెంట్ డాక్టర్ ఎన్.సేతు మాట్లాడుతూ ప్రయివేట్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో స్వాతంత్ర దినోత్సవ సంబరాలు దిగ్విజయంగా నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అపుస్మా జిల్లా అధ్యక్షులు రఘునాథరెడ్డి, కమిటీ సభ్యులు, గౌతమ్ స్కూల్ కరెస్పాండెంట్ లక్ష్మి నారాయణ, నాదెళ్ల విద్యాసాగర్, భవాని ప్రసాద్, పోర్డ్ డైరెక్టర్ లలితమ్మ, వివిధ విద్యాసంస్థల ప్రతినిధులు ప్రభుత్వ కళాశాలల ప్రిన్సిపల్స్, ఎఇఒ ప్రభాకర్ రెడ్డి, ఎంపిడిఒ భాను ప్రసాద్, మునిసిపల్ కమిషనర్ కె.ప్రమీల, తహశీల్దార్ ఖాజాబీ,సిఐలు శేఖర్, చాంద్ బాషా, హెడ్ కానిస్టేబుల్ రామ్మూర్తి, వివిధ విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థులను మానసికంగా వేధించడం తగదు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్



పాఠశాల ఎదుట నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

ప్రత్యేక తరగతుల పేరుతో ఉదయం ఆరు గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు తరగతులు నిర్వహించి విద్యార్థులను మానసికంగా వేధించడం తగదని విద్యార్థి సంఘాల నాయకులు పేర్కొన్నారు. రెండవ శనివారం శెలవు అయినప్పటికీ తరగతులు నిర్వహిస్తున్న ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలలను ఎస్ఎఫ్ఐ, పిడిఎస్‌యు నాయకులు సందర్శించి నిరసన తెలిపారు. ఉపాధ్యాయులతో చర్చించి విద్యార్థులను ఇళ్లకు పంపించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ సర్వేపల్లి, పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు నేటి నాగేశ్వర మాట్లాడుతూ విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణంలో తరగతులు నిర్వహించాలని ప్రభుత్వం పలుమార్లు హెచ్చరించినప్పటికీ ర్యాంకుల కోసం విద్యార్థులను వేధిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయాన్ని విద్యాశాఖ అధికారులకు దృష్టికి తీసుకెళ్లినా చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించే ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుండా విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని అన్నారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు చంగయ్య, ప్రసాద్, మదన్మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

గుండె వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : సత్సంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వాస్థ్య హాస్పిటల్ చారిటీ హాస్పిటల్ నందు శనివారం నిర్వహించిన గుండె వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. బెంగళూరు వైదేహి హాస్పిటల్ డాక్టర్ దుర్గాప్రసాద్, వారి డాక్టర్ల బృందం ఉచితంగా గుండె పరీక్ష శిబిరంలో పాల్గొని రోగులకు వైద్య పరీక్షలు చేశారు. మదనపల్లె పట్టణంతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన సుమారు 300మందికి పైగా శిబిరానికి విచ్చేసి వైద్య సేవలు పొందినట్లు స్వాస్థ్య ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ వెంకటరమణ తెలిపారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

- డిఎంహెచ్ఒ కొండయ్య

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ప్రతిరోజూ ఏదో ఒక గ్రామ పంచాయతీకి వెళ్లి ప్రజలకు 104ద్వారా మెరుగైన సేవలను అందించాలని డిఎంహెచ్ఒ డాక్టర్ కొండయ్య పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని పోలి గ్రామంలో 104 వాహనం ద్వారా అందిస్తున్న సేవలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రిజిస్టర్ పరిశీలించి ఇప్పటివరకు చేసిన పరీక్షలు, ఇచ్చిన మందులు వివరాలు 104 వాహన సేవలందిస్తున్న డాక్టర్ అశ్విన్ చంద్రను అడిగి తెలుసుకున్నారు. కొంతమంది రెండవ శనివారం అని విధులకు డుమ్మా కొడుతున్నారని, ఇది మంచి పద్ధతి కాదని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ విధులకు సక్రమంగా హాజరవుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. లేనిపక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం పోలి గ్రామంలో నూతనంగా నిర్మించిన విలేజ్ క్లినిక్, ఆరోగ్య ఉప కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త రెడ్డమ్మ, ఎంఎల్‌హెచ్‌పి శ్వేత, ఆశ కార్యకర్తలు 104 వాహన సిబ్బంది పాల్గొన్నారు.



పోలి గ్రామంలో తనిఖీ చేస్తున్న డిఎంహెచ్ఒ కొండయ్య



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మదనపల్లి

మదనపల్లి నియోజకవర్గ పరిధిలోని అన్ని గ్రామపంచాయతీ సర్పంచ్‌లు, కార్యదర్శులు, ఎఎన్ఎంలు రాబోయే రోజుల్లో వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా పారిశుధ్యపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. శనివారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సమావేశహాల్లో నిర్వహించిన పంచాయతీ కార్యాదర్శులు, సర్పంచులు, ఎఎన్ఎంల శిక్షణా, అవగాహనా ముగింపు కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు చిత్తూరు, కడపజిల్లాలలో ఇప్పటికే ప్రజలు జ్వరాలతో బాధపడుతున్నట్లు తెలిపారు. అన్నమయ్య జిల్లాలో ఈ పరిస్థితి లేదని దీన్ని దృష్టిలో పెట్టుకుని గ్రామాల్లో పర్యటించి పారిశుధ్య పనులు ముమ్మరంగా చేపట్టాలని సూచించారు. ఆశా కార్యకర్తలు, ఎఎన్ఎంలతో పాటు గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు తమ తమ గ్రామపంచాయతీలలో పర్యటించి తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సోమవారం జరిగే ప్రజా పిర్యాదు ల కార్యక్రమంలో అందరూ పాల్గొని వచ్చే పిర్యాదు లపై క్షేత్ర స్థాయిలో పరిశీలించి వీలైనంత త్వరగా పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ భానుప్రసాద్, ఎంపిపి రెడ్డెమ్మ, వైస్ ఎంపిపి రమణ, సర్పంచ్‌లు ప్రభాకర్, ఆనంద పార్థసారధి, శరత్‌రెడ్డి, ఆరోగ్య కార్యకర్తలు, టిడిపి నాయకులు నాదేళ్ల విద్యాసాగర్, పణికర్‌రెడ్డి, జెఎల్.రమణ, శశి పాల్గొన్నారు.

స్కీమ్ వర్కర్లపై రాజకీయ వేధింపులు తగవు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

స్కీమ్ వర్కర్లపై రాజకీయ వేధింపులు ఆపాలని, అక్రమంగా తొలగించిన వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ డిమాండ్ చేశారు. శనివారం మదనపల్లె స్థానిక సంతగేటు లోని ఏఐటీయూసీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో సాంబశివ మాట్లాడుతూ అంగన్వాడీ, ఆశ, మధ్యాహ్న భోజన వంట కార్మికులు, స్కూల్ స్వీపర్లు తదితర కార్మికులపై రాజకీయ వేధింపులకు పాల్పడుతూ అక్రమంగా తొలగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కక్ష సాధింపు చర్యలు, దౌర్జన్యాలు ఉండవని అసెంబ్లీ సాక్షిగా తెలిపిన సిఎం చంద్రబాబు నాయుడు స్కీమ్ వర్కర్లను తొలగించకుండా అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. చిరుద్యోగులైన స్కీమ్ వర్కర్స్‌పై రాజకీయ వేధింపులు అరికట్టాలని, అక్రమంగా తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎఐటియుసి మదనపల్లి పట్టణ కార్యదర్శి తిరుమల, రెడ్డప్ప, మురళి చలపతి, కదిరెప్ప, రామచంద్ర, మల్లీ పాల్గొన్నారు.

ప్రక్షాళన!

ప్రజా'దృష్టి'

జిల్లా ఉన్నతాధికారుల బదిలీల జాతర కొనసాగుతోంది. ఇటీవల జిల్లా ఉన్నతాధికారులు మొదలుకుని తహశీల్దార్లు, ఎంపిడి ఓలు, ఎస్ఐలు, సిఐలు, డిఎస్పీల బదిలీలు వ్యవహారం ముగిసింది. 2024 సార్వత్రిక ఎన్నికల అనంతరం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి సర్కారు పాలనా యంత్రాంగంలో సమూల మార్పులు చేసింది. ఇందులో ప్రధానంగా పోలీస్, రెవెన్యూ అధికారుల బదిలీలను గుప్పిట పట్టే ప్రయత్నం కూటమి నాయకులు చేసినట్లు కనిపిస్తోంది. వైసిపి హయాంలోని రెవెన్యూ, పోలీస్ అధికారుల సమక్షంలో ఇసుక దోపిడీ, భూకబ్జాల వ్యవహారం ఇష్టారాజ్యంగా సాగిపోయింది. తాజా బదిలీల వ్యవహారం నేపథ్యంలో కూటమి నాయకులు తనకు నచ్చని అధికారులను బదిలీ చేయాలని, అదేసమయంలో ఇష్టమైన అధికారులను గుర్తించి తమ అడుగులకు మడుగులొత్తే రెవెన్యూ, పోలీస్ అధికారులను నియమించుకుంది. ఇష్టమైన అధికారుల సహకారంతో ఇష్టారాజ్యంగా దోపిడీ చేసుకోవడానికి ఏర్పాట్లు చేసుకున్నట్లు కనిపిస్తోంది. వైసిపి హయాంలో వైసిపి నాయకులు, కూటమి హయాంలో కూటమి నాయకులు ఇష్టా రాజ్యంగా దోపిడీ చేయడం పరిపాటిగా మారింది. కూటమి సర్కారు అధికారంలోకి రావడంతో ప్రకృతి వనరుల అక్రమ రవాణాకు బ్రేకులు పడతాయని ఆశించిన వారికి నిరాశే ఎదురైంది. వైసిపి నేతల తరహాలోనే కూటమి నాయకులు భూ కబ్జాలకు పాల్పడడం విస్మయాన్ని కలిగిస్తోంది. వైసిపి భూకబ్జాల కారణంగానే తీవ్ర అవమానకరమైన రీతిలో ఓటమిపాలు కావడం తెలిసిందే. ఇటీవల టిడిపి ప్రముఖ నాయకులు భూ కబ్జాల లావాదేవీ వ్యవహారంలో నీకు నాలుగు నాకు నాలుగు గదుల వాటా చందం అనే తీరు వెలుగులోకి రావడంతో టిడిపి నేతలు ఉలికిపాటుకు గురి కావడం తెలిసిందే. ఇంతటితో ఆగకుండా జిల్లా నుంచి పెద్దఎత్తున ప్రకృతి వనరులను దోపిడీ యథేచ్ఛగా సాగిస్తుండడం విస్మయాన్ని కలిగిస్తోంది. రాష్ట్రప్రభుత్వం ఉచిత ఇసుక విధానం పేరుతో ఐదు రకాల పన్నులతో కలిపి టన్ను రూ.8,500 నుంచి 12,000 వరకు వసూలు చేస్తున్న తీరు చర్చనీయాంశంగా మారింది. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో ఇసుక అక్రమ రవాణా తెరమీదికి వచ్చింది. జిల్లాలోని ఇసుక రేవుల నుంచి తిరుపతి, బెంగళూరు, చెన్నయ్ వంటి పట్టణాలకు యథేచ్ఛగా అక్రమ రవాణా సాగిపోతోంది. దీంతోపాటు ఇటీవల ఓ నాయకుడు రియల్‌ఎస్టేట్ వ్యాపారులతో సమావేశం నిర్వహించి, తనకు అందాల్సిన మామూళ్లు అందించాలని, లేకపోతే రియల్ ఎస్టేట్ వ్యాపారాలు సాగనీయ బోమని హెచ్చరించినట్లు సమాచారం. దీంతో వారికి ఏమి చేయాలో పాలుపోని పరిస్థితి నెలకొంది. ఇటు వంటి పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్రంలో ఎవరు అధికారంలోకి వచ్చినా సామాన్య ప్రజలకు ఒరిగిం దేమీ లేదనే వాదన వినిపిస్తోంది. రాష్ట్ర ప్రజలకు మాయమాటలు, అసాధ్యమైన హామీలతో అధికారంలోకి వచ్చిన రాజకీయ నాయకత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

హోరాహోరీగా క్రికెట్ మ్యాచ్‌లు

ప్రజాశక్తి - కడప :జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎసిఎ అండర్- 19 గ్రూపు -బి క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా వైఎస్ రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో జరుగుతున్న మ్యాచ్‌లో కృష్ణ జట్టు భారీ స్కోరు దిశగా పయనిస్తోంది. ఒక వికెట్ నష్టానికి 23 పరుగుల ఓవర్ నైట్ స్కోర్ తో రెండవ రోజు బ్యాటింగ్ ప్రారంభించిన కృష్ణా జట్టు రెండవ రోజు ఆట ముగిసే సమయానికి 105.0 ఓవర్లలో 2 వికెట్లు నష్టానికి 335 పరుగులు చేసింది. ఆ జట్టులోని వరుణ్ సాత్విక్ బ్యాటింగ్‌లో అద్భుతంగా రాణించాడు. 210 బంతులను ఎదుర్కొని 21 బౌండరీలు, ఒక సిక్సర్ సహాయంతో 147 పరుగులు చేసి నాట్ అవుట్‌గా నిలిచారు. **కెఎస్ ఆర్ఎం క్రికెట్ మైదానంలో** జరుగుతున్న మ్యాచ్‌లో విశాఖపట్నం జట్టు భారీ స్కోరు దిశగా పయనిస్తోంది. వికెట్ నష్టపోకుండా 16 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో రెండవ రోజు బ్యాటింగ్ ప్రారంభించిన విశాఖపట్నం జట్టు రెండవ రోజు వాట ముగిసే సమయానికి 89.0 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 381 పరుగులు చేసింది. ఆ జట్టులోని బి. యశ్వంత్ 132 పరుగులు(సెంచరీ), పరం వీర్ సింగ్ 128 పరుగులు (నాటౌట్) చేశారు. **కెఒఆర్ఎం క్రికెట్ మైదానంలో** జరుగుతున్న మ్యాచ్‌లో వికెట్ నష్టపోకుండా 58 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో రెండవ రోజు బ్యాటింగ్ ప్రారంభించిన శ్రీకాకుళం జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 80.1 ఓవర్లలో 243 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని రాజ్ కుమార్ 65, సుశాంత్ 55 పరుగులు చేశారు. వెస్ట్ గోదావరి జట్టులోని రేవంత్ నాగ కుమార్ అద్భుతంగా బౌలింగ్ ప్రదర్శించి 6 వికెట్లు తీసుకున్నాడు. హర్షవర్ధన్ మూడు వికెట్లు తీసుకున్నాడు. అనంతరం బ్యాటింగ్ కు దిగిన వెస్ట్ గోదావరి జట్టు రెండవ ఇన్నింగ్స్ లో ఆట ముగిసే సమయానికి 22.0 ఓవర్లలో రెండు వికెట్లను నష్టానికి 66 పరుగులు చేసింది.


కాలిపోయిన దుకాణాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్, అధికారులు

దుకాణాల్లో అగ్నిప్రమాదం

-పరిశీలించిన ఎమ్మెల్యే అరవ శ్రీధర్

ప్రజాశక్తి - రైల్వేకోడూరు

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పట్టణంలోని టిఫిన్ సెంటర్, కూల్‌డ్రింక్స్ దుకాణాల్లో అగ్ని ప్రమాదం సంభవించింది.శనివారం సిద్దయ్య టిఫిన్ సెంటర్, చంగయ్య, సంజీవరెడ్డి కూల్ డ్రింక్ షాపులు షార్ట్ సర్క్యూట్ జరిగి మూడు షాపులలో బియ్యపు మూటలు, గ్యాస్ సిలిండర్లు, ఫ్రిడ్జిలు, గ్రైండర్లు, కూల్ డ్రింక్స్, మెటీర్లు, పలు వస్తువులు కాలిపోయాయి. విషయం తెలిసిన వెంటనే ఎమ్మెల్యే అరవ శ్రీధర్ మూడు షాపులను పరిశీలించి సంబంధిత అధి కారులతో మాట్లాడి తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఇన్ ఛార్జి తహశీల్దార్ ప్రసాద్, ఆర్‌వి రాజశేఖర్, ఏ.ఓ.రెడ్డయ్య, జనసేన రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర, బిజెపి మండల అధ్యక్షుడు కొమ్మ శివ, సిసిఎస్ (బ్రదర్స్) జోగి నేని మణి, వరుకుట్టి నాగరాజు, గిద్దలూరు భాను, బీవీపతి, శంకర్‌రాయల్, కొప్పురవు అరవింద్, ఉంగరాల చిన్న, రాకేష్,షేక్ గౌస్, అంకిపల్లి మధు, వెంగయ్య, ప్రేమ్, ఎస్.రామయ్య, అరవ నాని,షేక్ అమ్మత్ పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-గుర్రంకొండ

నేటి ఉదయం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు రిడ్ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఈశ్వరయ్య ఒక ప్రకటనలో తెలిపారు. కంటి లో శుక్లాలు, కేటరాక్ట్ ఉన్నవారిని ఎంపిక చేసి మదనపల్లెలో ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తామని చెప్పారు. డాక్టర్ అగర్వాల్స్ దృష్టి కంటి హాస్పిటల్ వారి సహకారంతో, రిడ్ సేవా సంస్థ వారి సౌజన్యం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సదుపాయాన్ని మండల ప్రజలందరూ ఉప యోగించు కోవాలని కోరారు.


మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డిని సన్మానిస్తున్న స్థానిక నాయకులు

ఘనంగా సీతారాముల కల్యాణం

ప్రజాశక్తి-చిన్నమండెం

మండలంలోని వండాడి గ్రామం, గండ్లపల్లిలో మొదటి శ్రావణ శనివారం సందర్భంగా శ్రీ సీతారాముల స్వాముల వారి కళ్యాణ మహోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి హాజరైన మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సోదరుడు డాక్టర్ లక్ష్మి ప్రసాద్‌రెడ్డికి గ్రామ ప్రజలు ఘనస్వాగతం పలికారు. కళ్యాణ మహోత్సవం అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఆయనను శాలువాతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందించారు.

జిఒ117ను రద్దు చేయాలి

ప్రజాశక్తి-రామాపురం : జిఒ నెంబర్ 117 రద్దు చేయాలని జిల్లా తెలుగు నాడు ఉపాధ్యాయ సంఘం నాయకులు రాష్ట్ర మంత్రి నారాయణను శనివారం నెల్లూరులో కలసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలల నిర్వహణ గ్రాంట్ సకాలంలో విడుదల చేయాలని కోరినట్లు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో తెలుగునాడు ఉపాధ్యాయుల సంఘం ఉపాధ్యక్షుడు పిచ్చిరెడ్డి రామచంద్ర, సంజీవరెడ్డి, సుబ్రహ్మణ్యం, సుధాకర్, మనోహర్‌రెడ్డి, పీడీ రామచంద్ర, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

కొత్త పాలక మండళ్లను ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - వేంపల్లె

రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని మర్యాద పూర్వకంగా వేంపల్లె టిడిపి నేతలు కలిశారు. శనివారం ఆత్మకూరులో ఉన్న రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని టిడిపి జిల్లా మాజీ కార్యదర్శి పివి రమణ, దేవస్థానం మాజీ ఛైర్మన్ పొంగు కొండ్రాయుడు, మాజీ వార్డు మెంబరు రామకృష్ణారెడ్డి, భాస్కర్‌రెడ్డి(ఎల్‌ఐసి) కలిసి వృషభాచలేశ్వర స్వామి దేవస్థానం పాలక మండలిపై చర్చించారు. వేంపల్లెలోని వృషభాచలేశ్వర స్వామి దేవస్థానం పాలకమండలి పదవి కాలం మూడు నెలల క్రితం ముగిసిందన్నారు. నూతన పాలక మండలి ఏర్పాటు కాలేదని తెలిపారు. నూతన పాలక మండలిని ఏర్పాటుకు నోటిఫికేషన్ ఇవ్వాలని వారు మంత్రిని కోరారు. వైసిపి పాలనలో నియమించిన గండి దేవస్థానం పాలక మండలి సభ్యులు ఇంకా రాజీనామాలు చేయలేదని తెలిపారు. ఇందుకు స్పందించిన మంత్రి ఆనం రామనారాయణరెడ్డి త్వరలో గండి క్షేత్రానికి దర్శించి కొత్త పాలక మండలికి నోటిఫికేషన్ జారీ చేస్తానని హామీ ఇచ్చినట్లు చెప్పారు. వృషభాచలేశ్వర స్వామి దేవస్థానం కొత్త పాలక మండలి ఏర్పాటుకు కూడా నోటిఫికేషన్ ఇస్తానని చెప్పారు. మంత్రిని కలిసిన వారిలో టిడిపి నేతలు బలరామి రెడ్డి ఉన్నారు.

అమ్మవారిశాలలో సామూహిక ఒడిబియ్యం

ప్రజాశక్తి - మైదుకూరు

పట్టణంలోని శ్రీకన్యకా పరమేశ్వరీదేవి (అమ్మవారిశాల) ఆలయంలో శ్రావణమాసాన్ని పురస్కరించుకుని మహిళలు సామూహిక ఒడిబియ్యం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అభిషేకం, కుంకుమార్చనలు చేశారు. అనంతరం మాలేపాటి పద్మజ, ఆర్యవైశ్య మహిళా మండలి సభ్యుల ఆధ్వర్యంలో 370 మంది ముత్తైదువలకు ఒడిబియ్యం నింపే కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.

15న విద్యార్థులకు ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు

ప్రజాశక్తి - వేంపల్లె

స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ఆగస్టు 15న విద్యార్థులకు ఫ్యాన్సీ డ్రెస్ పోటీలను నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ సంపత్ దివిజా అన్నారు. మండలంలోని ఆయా ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల విద్యార్థులు స్వాతంత్య్ర సమరయోధుల వేషధారణలతో వచ్చి సమరయోధుల గురించి చెప్పాలని కోరారు. ఫ్యాన్సీ డ్రెస్, ప్రసంగంలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తామన్నారు. ఒకటవ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. పోటీల్లో పాల్గొనదలుచుకున్నవారు ఈనెల 12లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. రిజిస్ట్రేషన్ కోసం 89774 71317 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు. ఈ పోటీలు వైఎస్‌ఆర్ సభాభవనంలో ఆగస్టు 15న ఉదయం 11 గంటలకు ప్రారంభిస్తామన్నారు.

పొన్నతోట గంగమ్మకు ఘననివాళి

ప్రజాశక్తి - సింహాద్రిపురం

కమ్యూనిస్టు యోధుడు, జిల్లా కమ్యూనిస్టు పార్టీలో అగ్ర నాయకుల్లో ఒకరైన పొన్నతోట వెంకటరెడ్డి సతీమణి గంగమ్మకు శనివారం ఘననివాళి అర్పించారు. మండలంలోని అంకాలమ్మ గూడూరు గ్రామంలో ఆమె 18వ వర్థంతి సందర్భంగా గంగమ్మ, వెంకటరెడ్డిల స్తూపం వద్ద రాష్ట్రపతి అవార్డు గ్రహీత పొన్నతోట గంగాధర్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, సరళ పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గంగమ్మ వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట కాలంలో 1949 అక్టోబర్ 15న రాజుపాలెం గ్రామంలో జరిగిన పోలీసు కాల్పుల్లో కామ్రేడ్ చిన్న వెంకన్న, పెద్ద వెంకన్న, మారెన్న అమరులయ్యారని తెలిపారు. అనంతరం కామ్రేడ్ చెన్నారెడ్డి చెల్లెలు క్రియాశీలక కార్యకర్తగా పని చేశారన్నారు. నివాళులర్పించినవారిలో శివారెడ్డి, అంకన్న, రాజు, రామ్మోహన్, అజయ్ ఉన్నారు.

'వెలిగల్లు'కు రెండు బస్సు షెల్టర్లు

ప్రజాశక్తి-గాలివీడు

మండలంలోని వెలిగల్లు గ్రామపంచాయతీలో ప్రజలకు అనుకూలంగా రెండు బస్సు షెల్టర్లను ఏర్పాటు చేశారు. మండలంలో 17 గ్రామాలు ఉన్నాయి. చాలా గ్రామాల్లో బస్సు షెల్టర్లు లేవు. కొన్ని చోట్ల ఉన్నా నిరుపయోగంగా ఉన్నాయి. వెలిగల్లు పంచాయతీలో కదిరి రోడ్డు వైపు ఒక బస్సు షెల్టరు, రాయచోటి రోడ్డు వైపు ఒక బస్సుషెల్టర్‌ను ఏర్పాటు చేశారు. ప్రయాణికులు ప్రజలు ఎవరు అవస్థలు పడకుండా ఏ మార్గాన వెళ్లాల్సిన వారు ఆ బస్సుల దగ్గరికి వెళ్ళడానికి అవకాశం ఒక కేవలం వెలిగల్లు గ్రామంలోనే ఉందని గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. వెలిగల్లు విజిబుల్ క్లీన్ గ్రామ పంచాయతీగా ఎన్నికైందని అన్నారు. గ్రామ సర్పంచ్ నఫీస్, మండల స్థాయి అధికారుల కృషితోనే గ్రామపంచాయతీ ఆదర్శంగా నిలవగలిగే స్థాయికి ఎదుగుతూ వచ్చిందని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


కదిరి రహదారిపై ఉన్న రెండవ కొత్త బస్సు షెల్టర్

గండిక్షేత్రానికి పోటెత్తిన భక్తులు

రెండు గంటలపాటు ట్రాఫిక్‌లో నిలిచిపోయిన వాహనాలు, భక్తులకు తప్పని తిప్పలు


ఆంజనేయ స్వామి దర్శనం కోసం బారులుతీరిన భక్తులు

ప్రజాశక్తి - చక్రాయపేట

రాయలసీమలో పేరుప్రఖ్యాతి చెందిన గండి క్షేత్రంలో మొదటి శ్రావణమాస శనివారం కావడంతో భక్తులు పోటెత్తారు. గండిక్షేత్రంలో రాయచోటి, వేంపల్లి వైపు నుంచి వచ్చే వాహనాలు అధికమై రెండు గంటలపాటు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. భక్తులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రధాన అర్చకులు కేసరి స్వామి, ఉప ప్రధాన అర్చకులు రాజా స్వాములు అంజన్నకు చేసిన అలంకరణ భక్తులను అలరించింది. స్వామి దర్శనానికి భక్తులు బారులుతీరారు. దేవస్థాన అసిస్టెంట్ కమిషనర్ జె.వెంకటసుబ్బయ్య, దేవస్థాన చైర్మన్ కావలి కృష్ణతేజ ఆధ్వర్యంలో పలు ఏర్పాట్లు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆర్కే వ్యాలీ సిఐ గోవింద్‌రెడ్డి, వేంపల్లి సీఐ సురేష్‌రెడ్డి, ఆధ్వర్యంలో వేముల ఎస్ఐ ధనుంజయరెడ్డి, చక్రాయపేట ఎస్ఐ వినోద్‌కుమార్, ఆర్కే వ్యాలీ ఎస్ఐ రంగారావు ఆయా స్టేషన్ల పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. డిఎంహెచ్ఒ డాక్టర్ నాగరాజు, ఎఎండి వెంకటరెడ్డి, వైద్య అధికారి వాణి, సిహెచ్ఒ వెంకట్రామిరెడ్డి ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని నేరుసుపల్లె గ్రామ యువత భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమం చేశారు. కార్యక్రమంలో దేవస్థాన చైర్మన్ కావలి కృష్ణతేజ, మాజీ చైర్మన్ వెంకటస్వామి, దేవస్థాన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

– శ్రావణ శనివారం సందర్భంగా దశరథ మహారాజు దేవస్థానం వద్ద అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అన్న ప్రసాదం దాత మేడిశెట్టి చిన్న వెంకటసుబ్బయ్య కుమారులు వెంకట సుబ్బయ్య, చిన్న వెంకటసుబ్బయ్య, రామాంజులు వారి కుటుంబ సభ్యులు, ధర్మకర్త, భక్తులు పాల్గొన్నారు. దశరథ మహారాజు స్వామి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు.

గండిక్షేత్రంలో తాగునీరు పంపిణీ

వేంపల్లె : శ్రావణమాసం సందర్భంగా గండికి కాలినడకన వెళ్లే భక్తులకు మానవతా సేవా సంస్థ సభ్యులు తాగునీటిని పంపిణీ చేశారు. శనివారం శ్రావణ శనివారం సందర్భంగా వేంపల్లెలోని రాయచోటి రోడ్డులో మానవతా సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉచిత తాగునీటి పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేశామని సంస్థ చైర్మన్ చక్రపాణిరెడ్డి తెలిపారు. అలాగే కుమ్మరాంపల్లె గ్రామ సమీపంలో ఉన్న శ్రీకృష్ణుడి ఆలయం సమీపంలో అన్నదానం ఏర్పాటు చేశారు. గండి దేవస్థానం చైర్మన్ కృష్ణతేజ, మానవతా సేవా సంస్థ అధ్యక్షుడు శ్రావణ్ కుమార్, మాజీ అధ్యక్షుడు బాలాజీ, గోపి, సభ్యులు పాల్గొన్నారు.

అంజన్న సేవలో ట్రిపుల్‌ఐటి విద్యార్థులు

గండి శ్రీ వీరాంజనేయ స్వామి సేవలో ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటి విద్యార్థులు భక్తులకు సేవలు చేశారు. మొదటి శ్రావణ శనివారం సందర్భంగా గండి క్షేత్రానికి భక్తులు భారీగా సంఖ్యలో వచ్చారు. 3,8,14 ఎన్ఎస్ఎస్ యూనిట్ విద్యార్థులు గండిక్షేత్రంలో క్యూ లైన్‌లో భక్తులకు సేవలు అందించడంతోపాటు ప్రసాదాలు పంపిణీ చేశారని ప్రోగ్రాం అధికారులు విశ్వనాథ్‌రెడ్డి, అపర్ణ, పిఆర్ఒ తిరుపతిరెడ్డి చెప్పారు. డైరెక్టర్ కుమారస్వామి గుప్తా, పరిపాలన అధికారి డాక్టర్ రవికుమార్, డీన్ అకాడమిక్ రత్నకుమారి సహకారంతో గండి క్షేత్రంలో విద్యార్థులు సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో కొ–ఆర్డినేటర్ మధుసూదన్, విద్యార్థులు పాల్గొన్నారు.


మానవత సభ్యులు ఏర్పాటు చేసిన తాగునీరు

ఏటూరు కాలువకు పైపులైన్ ఏర్పాటు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని ఏటూరు కాలువలో పైపులైన్లు ఏర్పాటు చేశారు. బళ్లారి–నెల్లూరు హైవేలో భాగంగా రోడ్డు విస్తరణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా ఏటూరు కాలువ వద్ద వంతెన ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్రస్తుతం కెసి కాలువకు నీరు విడుదల కావడంతో రైతులకు ఇబ్బందులు జరగకుండా నీటి సరఫరా జరిగేలా ఏర్పాట్లు చేపట్టారు. విశ్వనాథపురం వద్ద నుంచి మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోకి హైవే రోడ్డు పనులు జరుగుతున్నాయి. విశ్వనాథపురం గ్రామం వద్ద పంట కాలువలు అధికంగా ఉండడంతో రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతున్నారు.



నేడు మంత్రి ఫారూఖ్ ప్రొద్దుటూరుకు రాక

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

రాష్ట్ర లా, మైనారిటీ సంక్షేమశాఖ మంత్రి ఫారుఖ్ ఆదివారం ప్రొద్దటూరుకు రానున్నట్లు టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వి.యస్. ముక్తి యార్ తెలిపారు. శనివారం సాయం త్రం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలే కరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రొద్దుటూరు అంజుమన్ అహ్లెఇస్లాం ఆధ్వర్యంలో ఫారుఖ్‌తోపాటు ఎంఎల్‌ఏ నంద్యాల వరదరాజులరెడ్డికి సన్మాన కార్యక్రమం ఉంటుందన్నారు. స్థానిక ఇంటర్నేషనల్ ఫంక్షన్ హాలులో ఉదయం 11గంటలకు కార్యక్రమం ఉంటుందన్నారు. తనతోపాటు టిడిపి ఆర్గనైజింగ్ రాష్ట్ర కార్యదర్శి సురేష్ నాయుడు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొంటారని తెలిపారు. మంత్రి ఫారుఖ్ టిడిపి పార్టీ ఆవి ర్భావం నుంచి ఉన్న సీనియర్ నాయకుడని తెలిపారు. స్థానిక మసీదులు, ఖబరస్తాన్, చర్చిల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకొచ్చి పరిష్క రించుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ముక్తియార్ కోరారు.

దోమల నివారణకు చర్యలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

దోమల నివా రణకు చర్యలు తీసుకుం టున్నామని సబ్ యూనిట్ వైద్యాధికారి సిద్దయ్య తెలిపారు. శనివారం నల్లపురెడ్డిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని మోట్నూతలపల్లిలో నిల్వ లున్న నీటిలో, నీటి తొట్టెలో దోమల నివారణకు సైఫో నోత్రీన్ పిచికారీ చేయిం చారు. ఈ సందర్భంగా సిద్ధయ్య మాట్లాడుతూ దోమకాటుకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. దోమకాటుతో మలేరియా, డెంగీ, చికెన్ గన్యా, బోదకాలు, మెదడు వాపు వంటి వ్యాధులు వస్తాయని ప్రజలకు వివరించారు. ప్రజలకు పరిశుభ్రతపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సిహెచ్ఓ శైలాబీ, అరోగ్య కార్యకర్తలు షీబారణి, రమాదేవి, ఆశా కార్యకర్త రాజాబీపాల్గొన్నారు.

డిగ్రీ ఫలితాల్లో ఎస్‌విడిసి విద్యార్థులకు యూనివర్సిటీ ర్యాంకులు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

స్థానిక శ్రీకృష్ణ గీతాశ్రమం లోని శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాల విద్యార్థులు వైవియు విడుదల చేసిన 2,4వ సెమిస్టర్ ఫలితాల్లో యూనివర్సిటీ ఫస్ట్ ర్యాంకులు సాధించారని ఆ కళాశాల కరస్పాండెంట్ అర్కటవేముల హరి నారాయణ తెలిపారు. రెండవ సెమిస్టర్ ఫలితాల్లో బిఎస్సీ హానర్స్ జువాలజీలో మంజులత, మాధవి, తేజశ్విని 10కి 10 జిపిఏ, బిఎస్సీ బయోటెక్నాలజీ లో జ్ఞానశ్రీ 10కి 10 జిపిఏ సాధించారన్నారు. బిఎస్సీ జువాలజీలో తస్లీమ్, చందన, లాలస, ప్రవీణ 9.75, శాంతి, ఆస్మా, సాత్విక 9.50, స్నేహా, తన్మయ్ 9.25, నిత్య, తేజస్విని 9.17, తస్లీమ్, దేవిక 9 జిపిఏ, బిబిఏ కోర్సులో అమీర్ బాష 9.75, గంగా మహేశ్వరి 9.33, బిసిఏలో నూరిన్ 9.42, జయశ్రీ 9, బిఎస్సీ కంప్యూటర్ సైన్స్‌లో సుప్రజ 9.42, లక్ష్మీ ప్రసన్న 9, బికాంలో హసీనా 9.50, పరిమళ 9.17, 4వ సెమిస్టర్ ఫలితాల్లో బిఎస్సీ బిజడ్‌సి గ్రూప్‌లో షబానా 9.76, రిహానా 9.71, సమియా, అనుష్క, అల్యు రాణి 9.55, సుశీల్ 9.40, మానస 9.31, అపర, రుబీనా, సమ్రీన్ 9.28, నవ్య, ముస్కాన్ 9, ఎంపిస్సీఎస్ విభాగంలో రవికిరణ్ 7.76, బికాంలో ధనశ్రీ 8.95, బిబిఏలో వినయ్ 8.66 సాధించారన్నారు. ఇంతటి విజయం సాధించిన విద్యార్థులను ప్రిన్సిపల్ మహ్మద్ ముస్తఫా, వైస్ ప్రిన్సిపాల్ శారద, ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ రామమోహన్, హెచ్‌ఓడిలు మౌనయ్య, అజ్రా, గౌరీ శంకర్ అభినందించారు.

ఉన్నత ఆలోచనలు మంచి జీవితాన్నిస్తాయి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ఉన్నత ఆలోచనలు మంచి జీవితాన్ని ప్రసాదిస్తాయని జమ్మలమడుగు డిఎస్‌పి హుస్సేన్ పీరా తెలిపారు. స్థానిక సాయి శివాని ఫంక్షన్ హాల్‌లో శ్రీ షిర్డీసాయి జూనియర్ కళాశాల కరస్పాండెంట్ ఎన్.హైమవతి, ప్రిన్సిపల్ క్రరు సంజీవరెడ్డి అధ్యక్షతన శనివారం ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా విచ్చేసిన డిఎస్‌పి మాట్లాడుతూ ఇంటర్‌లో ప్రవేశించిన విద్యార్థులు భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని మంచి ఆలోచనలతో మెలగాలన్నారు. విద్య ఒక్కటే జీవితాన్ని ముందుకు తీసుకెళుతుందన్నారు. తప్పుడు మార్గంలో వెళ్లకుండా సన్మార్గంలో వెళ్లాలని సూచించారు. అనంతరం కరస్పాండెంట్ హైమవతి మాట్లాడుతూ తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తెరిగి చదవాలన్నారు. ప్రిన్సిపల్ సంజీవరెడ్డి, శ్రీ షిర్డీసాయి డిగ్రీ కళాశాల ప్రిన్సి పల్ సుధ మాట్లాడారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో డిఎస్‌పితోపాటు జమ్మలమడుగు, అర్బన్, రూరల్ సిఐలు కరుణాకర్, గోపాల్‌రెడ్డి, ఎస్ఐ కల్పన, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యూనివర్సిటీ టాపర్స్ జమ్మలమడుగు విద్యార్థులు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

యోగి వేమన విశ్వవిద్యాలయం విడుదల చేసిన రెండవ సెమిస్టర్, నాలుగవ సెమిస్టర్ పరీక్ష ఫలి తాల్లో ఉత్తమ ప్రతిభ కనపరచి యూనివర్సిటీ టాపర్స్‌గా రావడం పట్ల జమ్మలమడుగు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.చంద్రశేఖర్ శనివారం హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ కళాశాలలో చదువుతున్న బిఏ ఎకనామిక్స్ ఆనర్స్ విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించడంతోపాటు, యూనివర్సిటీ ర్యాంకులు సాధించడం ఆనందంగా ఉందన్నారు. బిఏ ఎకనామిక్స్ ఆనర్స్ విభాగంలో ఎ.మాధవి 9.67, సి.చందు 9.33, పి.చాందిని 9.33, బి.గౌరీ మోహన్ 9.33, కె.సౌజన్య 9.33, ఎన్.ప్రమీల 9.33, కె.హారిక 9.33, కె.శ్రీనివాసులు 9.0, వై.శివకిషోర్‌రెడ్డి 9.0, ఎమ్.సతీష్ కుమార్ నాయక్ 9.0, నాలుగవ సెమిస్టర్ ఫలితాల్లో పి.ప్రియాంక 9.13, జి.పవన్ 9.40, జి.విశ్వనాథ్ 8.30, ఎమ్.పార్థసారథి 8.40, కె.రవికుమార్ 8.13, జి.ఈశ్వర్ 8.8, పి.శివకుమార్ 8.7 పాయింట్లతో ఉత్తమ ప్రతిభ కనబరిచారన్నారు. ప్రిన్సిపల్, ఎకనామిక్స్ అధ్యాపకులు డాక్టర్ ఎం సుధీర్ రెడ్డి, బాబూరావు, వైస్ ప్రిన్సిపల్ డిసి సంజీవరెడ్డి విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

శుభ్రమైన నీటిని అందించడమే లక్ష్యం

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలకు శుభ్రమైన తాగునీటిని అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని కమిషనర్ ప్రమోద్‌కుమార్ తెలిపారు. తాగునీటికి సంబంధించిన మోటర్లను శనివారం ఆయన పరిశీలించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ దొమ్మర నంద్యాలలో ఉన్న మంచి నీటి ట్యాంక్‌ను శుభ్రపరిచే నిమిత్తం పట్టణానికి రెండు రోజులు మంచి నీటి సరఫరా ఆపేయడంతో స్థానిక ఎమ్మెల్యే ఆది నారాయణ రెడ్డి, టిడిపి ఇన్ ఛార్జి భూపేష్ రెడ్డి సౌజ న్యంతో దాదాపు 20 ట్యాంకర్లతో సరఫరా చేశామన్నారు. జమ్మల మడుగు నగర పంచాయతీ పరిధిలోని కాలువల్లో పూడికతీత పనులు జరుగుతున్నాయని వివ రించారు. మైలవరం ఉత్తర కాలువలో జంబును తొల గించామని తెలిపారు.


బాటవారిపల్లె జడ్‌పి స్కూల్ ఎదుట ఏర్పాటు చేసిన బారికేడ్లు

బారికేడ్లతో ప్రమాదాలు

ప్రజాశక్తి-కలకడ

ప్రమాదాల నివారణ కోసం ఏర్పాటు చేసిన బారికేడ్లతోనే ప్రమాదాలకు గురువుతున్నామని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిత్తూరు– కర్నూలు జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన భారీ కేడ్లతో ప్రమాదాలు తరచుగా జరుగుతున్నట్లు స్థానికులు వాపోతున్నారు. బాటవారి పల్లి పంచాయతీ జడ్‌పి ఉన్నత పాఠశాల(తెలుగు) ఎదురుగా ప్రమాదాల నివారణ కోసం ఏర్పాటుచేసిన భారీ కేడ్లతోనే ప్రమాదాలు తరచుగా జరుగుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. పాఠశాల విద్యార్థులకు ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు, వాహనాలు అతివేగంగా రాకుండా ఉండేందుకు అధిక సంఖ్యలో భారీకేట్లను స్థానిక పోలీసులు ఏర్పాటు చేశారు. బారికేడ్ల వల్ల ద్విచక్ర వాహన దారులు ప్రమాదానికి గురై గాయాలు పాయలైనట్లు స్థానికులు వాపో తున్నారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి భారీ కేట్లను సంఖ్యను తగ్గించి ప్రమాదాలు జరగకుండా నివారించాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్థానిక ప్రజలు, వాహనదారులు పేర్కొన్నారు.


ఉబేదుల్లాను సన్మానిస్తున్న టిడిపి నాయకులు

డైట్ స్కూల్ కమిటీ చైర్మన్‌గా ఉబేదుల్లా

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

పాఠశాల అభివృద్ధి కోసం అన్ని రకాలుగా సహకరిస్తానని, నాణ్యమైన విద్యను ఉపాధ్యాయులు బోధించుటకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావడానికి కృషి చేస్తానని డైట్ స్కూల్ కమిటీ నూతన చైర్మన్ ఉబేదుల్లా అన్నారు. గురువారం స్థానికడైట్ పాఠశాలలోని స్కూల్ ఎడ్యుకేషన్ కమిటీ ఎన్నికలలోచైర్మన్, వైస్ చైర్మన్ ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. తాను ఏకగ్రీవం కావడానికి సహకరించిన మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, సోదరుడు లక్ష్మి ప్రసాద్ రెడ్డి, రవి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి, కుప్పం నియోజ కవర్గ పరిశీలకులు గాజుల ఖాదర్ బాషా, టిడిపి అధికార ప్రతినిధి వతన్ నిసార్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు రఫీ, సద్దాంహుస్సేన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రామసముద్రం ఎస్ఐగా రవికుమార్

ప్రజాశక్తి-రామసముద్రం


బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్ఐ రవికుమార్

రామసముద్రం ఎస్ఐగా రవికుమార్‌ను నియమిస్తూ కర్నూల్ రేంజ్ డిఐజి డాక్టర్ కోయా ప్రవీన్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. రామ సముద్రం ఎస్ఐ పని చేస్తున్న చంద్ర శేఖర్ బదిలీపై కర్నూల్ విఆర్‌కు బదిలీ అయ్యారు. మదనపల్లె తాలూక ఎస్ఐ గా పని చేస్తున్న రవికుమార్ బదిలీపై రామసముద్రం ఎస్ఐగా పదవి బాధ్యతలు చేపట్టనున్నారు.

గెస్ట్ ఫ్యాకల్టీలకు హోదాను మార్చాలి

ప్రజాశక్తి - వేంపల్లె : ఆర్జీయూకేటీ పరిధిలోని నాలుగు ట్రిపుల్‌ఐటిల్లో పనిచేస్తున్న గెస్ట్ ఫ్యాకల్టీలకు డిజిగ్నేషన్ మార్చాలని హోం మంత్రి అనితను ఆర్జీయూకేటీ కాంట్రాక్టు టీచింగ్ ఫ్యాకల్టీ అసోసియేషన్ అధ్యక్షుడు నజీర్ హుసేన్ కోరారు. శనివారం కాంట్రాక్టు టీచింగ్ ఫ్యాకల్టీ గెస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయ వాడలో ఉన్న మంత్రి అనితకు ఆయన వినతి పత్రం అందజేశారు. కాంట్రాక్టు డిసిగ్నేషన్ ఇవ్వకపోవడంతోపాటు రూ.25 వేలు వేతనంతోనే ఆరేళ్లుగా వెట్టిచాకిరి చేయించుకున్నారని చెప్పారు. కాంట్రాక్టు ఉద్యోగులకు రావాల్సిన బెనిఫిట్స్ ఏమి వర్తించలేదన్నారు. మిగతా ఫ్యాకల్టీకి రూ.33 వేలు వేతనం ఇస్తున్నట్లు చెప్పారు. 2021లో ప్రభుత్వం ఇచ్చిన జీవో నెంబర్ 110 ప్రకారం ఎలాంటి జీతభత్యాలు పెరగలేదని వివరించారు. గతంలో టిడిపి పాలనలో ఉద్యోగులుగా ట్రిపుల్‌ఐటిలో చేరామనే ఉద్దేశంతో ఎలాంటి బెనిఫిట్స్ రావడం లేదన్నారు. ఇందుకు స్పందించిన హోంమంత్రి అనిత మాట్లాడుతూ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చినట్లు నజీర్ చెప్పారు. మెటర్నిటీ లీవ్‌లతోపాటు జీవో ప్రకారం ఏమీ రావాలో అన్ని ఇప్పిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు.

పల్లేటి కులశేఖర్ మరణం తెలుగు నాటకరంగానికి తీరని లోటు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు : రైల్వేకోడూరుకు చెందిన సుప్రసిద్ధ నాటక రచయిత బహుముఖ ప్రజ్ఞాశాలి కళారత్న పల్లేటి కులశేఖర్ మృతి తెలుగు నాటక రంగానికి తీరనిలోటని కడప జిల్లా రచయిత సంఘం అధ్యక్షుడు జింకా సుబ్రహ్మణ్యం శనివారం ఒక ప్రకటనలో తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. శుక్రవారం రాత్రి ఆయన గుండెపోటులో మరణించిన వార్త దిగ్భ్రాంతిని కలిగించిందన్నారు. కులశేఖర్ సాహిత్యంలో అన్ని ప్రక్రియలలో రచనలు చేశారని, 66నాటకాలు రచించి, 10సార్లు ఉత్తమ రచయితగా నంది అవార్డులను పొందారన్నారు. కులశేఖర్ ఆరుమంది ముఖ్యమంత్రులచే, ముగ్గురు గవర్నర్లచే సత్కారాలు పొందారన్నారు. రేడియో, టి.వి., సినిమా రంగాలలో అపురూపమైన ప్రతిభను కనబరచిన పల్లేటి కులశేఖర్ మన జిల్లా వ్యక్తి కావడం మనకు గర్వకారణమన్నారు.

క్రైం కార్నర్

దంపతులపై కోళ్ల దొంగల దాడి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కోళ్ల దొంగలు దంపతులపై దాడి చేసి గాయపరిచిన సంఘటన శనివారం మదనపల్లె మండలంలో చోటు చేసుకుంది. బాధితులు రూరల్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు..పొన్నేటి పాళ్యం గ్రామం, సవరంవారిపల్లెకు చెందిన శ్యామసుందర్, గాయత్రి దంపతులు సుమారు 20 నాటు కోళ్లను పెంచుకున్నారు. పొరుగింటికి చెందిన జెన్నే చంద్రశేఖర్, దివాకర్, నిశాంత్ మరి కొందరు ఆ కోళ్లను దొంగలించి, చంపి గుట్టుగా తినేశారు. ఈ విషయం తెలుసుకున్న బాధిత దంపతులు గ్రామంలో పంచాయతీ పెట్టాలని పెద్ద మనుషుల దృష్టికి కోళ్ల దొంగతనాన్ని తీసుకెళ్లారు. తమపైనే కోళ్ల దొంగతనం నిందలు మోపుతార అంటూ గ్రామానికి సమీపంలో దారి కాచి దంపతులపై కర్రలతో దాడి చేసి కొట్టారు. ఈ దాడిలో గాయపడిన బాధితులను కుటుంబీకులు చికిత్స కోసం మదనపల్లె సర్వజన బోధనాస్పత్రికి తరలించారు. తాలూకా పోలీసులు కేసును విచారిస్తున్నట్లు తెలిపారు.

ముగ్గురు పేకాటరాయుళ్ల అరెస్టు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

పేకాట ఆడుతున్న ముగ్గురిని పోలీసులు శనివారం అరెస్టు చేశారు. ఎఎస్ఐ బొజ్జనాయక్ తెలిపిన వివరాల మేరకు..సిఐ సూర్యనారాయణ ఆదేశాల మేరకు పేకాట స్థావరాలపై దాడులు నిర్వహించినట్లు తెలిపారు. గట్టు పంచాయతీ, మొరంవారిపల్లె సమీపంలో గుట్టుచప్పుడు కాకుండా ముగ్గురు పేకాట ఆడుతుండగా అరెస్టు చేసినట్లు చెప్పారు. వారి వద్ద నుంచి రూ.6,520 నగదును స్వాధీనం చేసుకొని ,కేసు నమోదు చేసినట్లు తెలిపారు.